# నిబంధనల మేరకు బస్సులను నడపాలి..

## డీటీవో అజయ్ కుమార్‌రెడ్డి



డీటీవోను సన్మానిస్తున్న డీఎం ప్రతిమారెడ్డి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 : ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటిస్తూ బస్సులను నడపాలని జిల్లా రవాణ శాఖ అధికారి అజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నిర్మల్ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బస్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలను నడిపే వారందరూ విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం డీటీవోను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

భైంసా, ఫిబ్రవరి 3 : పట్టణంలోని వికాస్ పాఠశాలలో శనివారం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. భూకంపాలు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి, గుండె పోటుకు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా ప్రాణాలను రక్షించే విధానాన్ని వివరించారు. అంతేగాకుండా ప్రమాదాలకు గురై అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఆ వ్యక్తిని కాపాడేందుకు సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. ఇందులో ఆర్డీవో కోమల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ టీం, కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటూ నంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రవెల్లి మాజీ ఎంపీపీ తుకారాం

# రేవంత్ ఆదివాసులను పట్టించుకోలే..

- ఎన్నికల హడావుడే తప్పా.. గిరిజనులకు ఒరిగిందేమి లేదు..
- అభివృద్ధి, నిధులు, ఉద్యోగాల భర్తీ ఊసేలేదు..
- నాగోబా అభివృద్ధి కేసీఆర్ హయాంలోనే జరిగింది..
- కాంగ్రెస్ హయాంలోనే అడవిబిడ్డలు మృతిచెందారు.
- నిరాశ మిగిల్చిన ముఖ్యమంత్రి పర్యటన
- మాజీ ఎంపీపీ కనక తుకారాం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3 : 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటన నిరాశే మిగిల్చింది. ప్రసంగం అంతా ప్రతిపక్షాలను తిట్టడం, ఎన్నికల గురించి మాట్లాడడం తప్పా గిరిజనులకు ఒరిగిందేమి లేదు. అభివృద్ధి, నిధుల విడుదలపై హామీగాని ఇవ్వకపోవడం బాధ కలిగించింది.' అని ఇంద్రవెల్లి మాజీ ఎంపీపీ కనక తుకారాం మండిపడ్డారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పర్యటన మండలవాసులు, ఏజెన్సీలోని ఆదివాసులకు నిరాశే మిగిల్చింది తప్పా.. ప్రయోజనం ఏమి లేదని వాపోయారు. సీఎం ప్రసంగంలో గిరిజనులకు ఉద్యోగాల భర్తీ మాట లేకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. నాగోబా ఆలయంలో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే 1981 ఏప్రిల్ 20న జరిగిన కాల్పుల్లో ఆదివాసీ గిరిజనులు మృతి చెందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, బీఆర్‌ఎస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్, ఎంపీటీసీ మడావి భీంరావ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీ బేగ్, మాజీ సర్పంచ్‌లు కుడే కైలాస్, జాదవ్ లఖన్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ టేహేరే గణేశ్, మాజీ వైస్ ఎంపీపీ విజయ్, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్యామ్ కేంద్రే పాల్గొన్నారు.

# అమరవీరుల స్తూపానికి పాలాభిషేకం

**ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి..**

- ఇంకోసారి స్తూపం వద్ద మీటింగ్‌లు పెట్టి అపవిత్రం చేయవద్దు..
- ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఊరుకోం..
- ఆదివాసీ సంఘాల నాయకుల మండిపాటు



అమరవీరుల స్తూపం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని అమరవీరుల స్తూపాన్ని శనివారం ఆదివాసీ సంఘాల నాయకులు పాలతో శుద్ధి చేశారు. స్తూపం, జెండా గద్దె వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ మాట్లాడారు. ఫిబ్రవరి 2(శుక్రవారం)వ తేదీన కొందరు నాయకులు పాదరక్షలతో అమరవీరుల స్తూపం వద్ద ఎక్కి అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చాలా భిన్నంగా ఉంటాయి. వీటిని దృష్టిలో పెట్టకుని అమరవీరుల స్తూపం వద్ద మీటింగులు పెట్టి అపవిత్రం చేయవద్దని పేర్కొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మన్ తోడసం నాగోరావ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, ఇంద్రవెల్లి మండల తుడుందెబ్బ మండలాధ్యక్షుడు జుగ్నాక్ భరత్, కేస్లాపూర్ రాయిసెంటర్ గిత్తేదార్ కోట్నాక్ బారిక్‌రావ్, ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్‌రావ్, తోటి సంఘం నాయకులు మెస్రం జైరాం, తుడుందెబ్బ నాయకులు ఎర్మ కృష్ణ, జుగ్నాక్ జాలిమ్‌షావ్, దుర్వ జుగాదిరావ్, కోరెంగ దాదేరావ్, ఆత్రం మధూకర్, కోరెంగ మనోజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్

# అంతా ఎన్నికల డ్రామా

- రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్ పర్యటన
- ఐదు నిమిషాలు ఆదివాసుల సమస్యలు వినే తీరికే లేదా..
- ప్రజాపాలన అంటావు ఇదేనా..
- నీ ఉద్దేశం ఏమిటో గిరిజనులు గ్రహించారు..
- తగిన సమయంలో బుద్ధి చెబుతారు..
- తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్

నార్నూర్, ఫిబ్రవరి 3 : 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన అంతా రాజకీయ లబ్ధి కోసమేనని, ఎన్నికల డ్రామా అని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటన కేవలం స్వలబ్ధి కోసమే తప్పా, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను సీఎంకు తెలియజేయడానికి తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా, వివిధ సంఘాల నాయకులు ఎస్పీతో అనుమతి తీసుకున్నప్పటికీ, ఆదివాసుల సమస్యలను వినేందుకు సీఎంకు కనీసం ఐదు నిమిషాల సమయం లేదా అని ప్రశ్నించారు. ప్రజాపాలన పేరుకే తప్పా ఆచరణలో లేదని పేర్కొన్నారు. నీ ఉద్దేశం ఏమిటో గిరిజనులు గ్రహిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని మండిపడ్డారు. సీఎం పర్యటనను ఆదివాసులు పూర్తి స్థాయిలో గ్రహించారని తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్‌రావ్, మండలాధ్యక్షుడు శ్రీరామ్, జై భారత్ జిల్లా కో-ఆర్డినేటర్ పెందోర్ దీపక్, నాయకులు మెస్రం హన్మంత్‌రావు, ఉర్వేత రూప్‌దేవ్, అర్కా గోవింద్, మాడావి ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

# కేసీఆర్ అంటేనే నమ్మకం

ఇచ్చోడ, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ అంటే ద్రోహమని, కేసీఆర్ అంటే ప్రజలకు నమ్మకమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.1,00,116లు ఇచ్చారని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.1,00,116తోపాటు తులం బంగారం ఇస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహసీల్దార్ తుకారాం, ఎంపీటీసీ వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

### కేజీబీవీ పాఠశాల తనిఖీ

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బాలోని సమస్యలను ప్రత్యేకాధికారి మల్లిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావ్ పాల్గొన్నారు.

# కాల్చి చంపిన వారే కన్నీరు పెట్టినట్లుంది..

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు



## రూ.కోటి మంజూరు చేసి రూ. 5 కోట్లు దుబారా చేసిన్రు

- మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ విమర్శలు మానుకోవాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 3: ఇంద్రవెల్లిలో కాల్చి చంపినవారే కన్నీరు పెట్టినట్లుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో ఆ రోజు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది ఆదివాసులను పొట్టన పెట్టుకున్నారని, ఇప్పుడు ఏ హక్కు ఉందని సభ పెట్టి అమరులకు నివాళులర్పించారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులను, తాము చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం కేవలం ఆదివాసుల ఓట్ల కోసమేనని పేర్కొన్నారు. సీఎం హోదాలో వచ్చి కేవలం రూ. కోటి మంజూరు చేసి, సభకు మాత్రం రూ. 5కోట్లు దుబారా చేశారని ఆరోపించారు. 2014లో మొదటిసారి సీఎం హోదాలో వచ్చిన కేసీఆర్ రూ. 25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రెండోసారి వచ్చినప్పుడు కుమ్రం భీం పేరిట జిల్లాను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఎంతో చేసిన కేసీఆర్‌పై సీఎం నోరుపారేసుకోవడం సరికాదని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై చిన్న మాట కూడా మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ లేకుంటే రాష్ట్రం ఏర్పాటయ్యేదా.. ఈ రోజు రేవంత్ రెడ్డి సీఎం అయ్యేవారేనా అని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ ఆదివాసీలకు పోడు భూమి పట్టాలు ఇచ్చి, రైతు బంధు కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని గుర్తు చేశారు. దండారీ, గుస్సాడీకి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల హామీ 6 గ్యారెంటీలను పూర్తిగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కారణంగానే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలని హితవుపలికారు. ఎంపీపీ మల్లికార్జున్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశ్, గంధం శ్రీనివాస్, వెంకన్న, బాలేశ్ గౌడ్, కుమార్ ఉన్నారు

### ఫిబ్రవరి 6న జిల్లాకు హరీశ్‌రావు

జిల్లాకు ఫిబ్రవరి 6న సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి, అనంతరం సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# గురుకులాల్లో మంచి ఫలితాలు రావాలి..

## ఆర్‌సీవో గోపీచంద్



వివరాలను తెలుసుకుంటున్న గోపీచంద్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 3 : ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో ఈ విద్యా సంవత్సరం పది, ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఆ మేరకు ముందుకెళ్లాలని ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న యాక్షన్ ప్లాన్‌ను తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, ఏపీటీ అమృతలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా

# పరిశీలకురాలిని కలిసి కలెక్టర్



ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పెన్‌గంగ భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు భారతి లక్‌పతి నాయక్‌ను శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

## నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకే పోటీలను నిర్వహిస్తున్నామని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో గల జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి సోషల్ ట్యాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, మధుసూదన్, సోషల్ ఫోరం నూతన అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి భూషణ్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తాం..

## వీసీలో మంత్రి ధనసరి అనసూయ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



పాల్గొన్నా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల పాలన అమలు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ అధికారులతో పంచాయతీల అభివృద్ధిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేదీ నుంచి సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారని వివరించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించామని, ఆ మేరకు తాగునీటిని అందిస్తామని తెలిపారు. 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీఏ కిషన్, అధికారులు ఉన్నారు.

# పత్తి కొనుగోళ్లపై అపోహలు నమ్మవద్దు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 3 : మార్కెటింగ్ శాఖ ద్వారా నిర్మల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర చెల్లించి పత్తిని కొనుగోలు చేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ అన్నారు. ఇటీవల పత్తి బేళ్లు పెరిగిన నేపథ్యంలో తాత్కాలికంగా కొనుగోళ్లను నిలుపుదల చేశామని, ఈనెల 5 నుంచి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కొన్ని సామాజిక మాధ్యమాల్లో రైతులను తప్పుదోవ పట్టించే విధంగా సీసీఐ కొనుగోళ్లు నిలిచిపోతాయని తప్పుడు ప్రచారం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పత్తి కొనుగోళ్లు పూర్తయ్యే వరకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# 'పది'లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి..

**- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 3 : పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లాను ప్రథమ స్థానంలో మరోసారి నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. గతేడాది నిర్మల్ జిల్లాను పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిపారని, అదే స్ఫూర్తితో ఈ యేడాది కూడా ముందుంచాలని సూచించారు. పరీక్షలకు 45 రోజుల గడువు ఉందని, ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కోరారు. ప్రతిరోజు స్లిప్ టెస్టులు నిర్వహించి, వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా గురుకులాల కో-ఆర్డినేటర్ గోపిచంద్, గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి అంబాజీనాయక్, గంగాధర్, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, శ్రీదేవి, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, ఎంఈవోలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సక్సెస్

- సత్ఫలితాలిచ్చిన స్మైల్, ముస్కాన్
- వెట్టిచాకిరీ, భిక్షాటన నుంచి చిన్నారులకు విముక్తి
- నిర్మల్ జిల్లాలో 69 మంది చిన్నారుల గుర్తింపు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 3 : నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ విజయవంతమైంది. కార్మిక, పోలీసు, విద్యా శాఖ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల్ డివిజన్‌లో 43, భైంసా డివిజన్‌లో 26 మంది చిన్నారులను గుర్తించారు. ఇందులో 62 మంది బాలురు ఉండగా ఏడుగురు బాలికలు ఉన్నారు. యేడాదిలో రెండు సార్లు(జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు, జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్) నిర్వహిస్తూ చిన్నారులకు గుర్తించి పాఠశాల, వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. కాగా.. ఈ ఐదేళ్లలో 808 మంది చిన్నారులకు విముక్తి కల్పించారు. ఇందులో బాలురు 548, బాలికలు 260 మంది ఉన్నారు.




ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా చిన్నారిని గుర్తించి పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

### ఐదేండ్లలో గుర్తించిన చిన్నారులు..

| సంవత్సరం | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|
| 2020 | 78 | 66 | 144 |
| 2021 | 230 | 98 | 328 |
| 2022 | 133 | 67 | 200 |
| 2023 | 45 | 22 | 67 |
| 2024 | 62 | 07 | 69 |
| | 548 | 260 | 808 |

### నిరంతరాయంగా ఆపరేషన్



*బాలల రక్షణ కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుశాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో యేడాదిలో రెండు సార్లు నిర్వహిస్తున్నాం. చిన్నారులను దుకాణాలు, ఫ్యాక్టరీల్లో పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. బడిలో ఉండాల్సిన చిన్నారులు, భిక్షాటన, ప్రమాదకర పనుల్లో కనిపిస్తే.. డయల్ 100, 1098కి సమాచారం అందించాలి.* **- జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్.**